సాక్షి కర్నూలు

శనివారం । 16 । మార్చి । 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



సంప్రదాయ నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై ధర్మవరానికి చెందిన లలితా నాట్య కళానికేతన్ బృందం నృత్యప్రదర్శన అలరించింది.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకుర్పారణ చేశారు. ఎగువ అహోబిలంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:01
ఆదోని	సా॥ 6:35	ఉ॥ 5:04
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:58
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:59
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:59

హదీస్ వెలుగు :

'రంజాన్ ఉపావాస దీక్ష మనిషిలోని అహంను తొలగించి, ఆధ్యాత్మికత, మంచి నడవడికను నేర్పుతుంది. వీటిని తప్పనిసరిగా పాటించి అల్లాహ్ అనుగ్రహం పొందండి' – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన వారికి పదోన్నతి కల్పించడంతో పాటు ఇతర జిల్లాలకు పోస్టింగ్ ఇచ్చారన్నారు. పదోన్నతి పొందిన వారిలో కర్నూలు జిల్లాకు సంబంధించి కె.ఆనందరావు, ఎం.తిరుమలేశ్వరరెడ్డి, బీవీ నాగరాజు, టి.లావణ్య ప్రియ, ఎస్.బష్రీన్‌బీ, మాదిగ సంజప్ప, జీఆర్‌ఆర్ మద్దిలేటి రెడ్డి ఉన్నారన్నారు. అలాగే నంద్యాల జిల్లాకు సంబంధించి కె.సరళమ్మ, సి.హరిప్రసాద్, ఈ.శివ కుమార్ గౌడ్, జి.ప్రకాశం, వి.అశ్విన్‌కుమార్‌కు పదోన్నతి లభించిందన్నారు. రెండు జిల్లాలకు సంబంధించి పలువురికి సొంత జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వగా, మిగిలిన వారికి అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ థియరీ ప్రధాన పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి, వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో పరీక్షలు నిర్వహించారు. శుక్రవారంతో జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 20,294 మంది విద్యార్థులకుగాను 19,439 మంది హాజరు కాగా, 855 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో 18వ తేదీ నుంచి మూల్యాంకనాన్ని మొదలుపెట్టనున్నారు. ఇందుకు ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీలో ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూల్యాంకనానికి మొత్తం 704 మంది అధ్యాపకులను ఎంపిక చేశారు.

డీఎంహెచ్‌ఓగా డాక్టర్ ప్రవీణ్ కుమార్



కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ)గా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వచ్చాయి. డాక్టర్ ప్రవీణ్ కుమార్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న రామగిడ్డయ్య ప్రాంతీయ సంచాలకులుగా పదోన్నతి పొంది విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. ఆయన నుంచి శుక్రవారం రాత్రి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఆహార శుద్ధి.. పరిశ్రమ వృద్ధి



ఈ చిత్రంలో మహిళ పేరు ఇందిరమ్మ. కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన ఈమె వ్యవసాయ కూలి. ఐదు నెలల క్రితం సోలార్ డీహైడ్రేషన్ యూనిట్ ఏర్పాటు చేసుకున్నారు. ఈమెకు రోజుకు 200 నుంచి 300 కిలోల ఉల్లి లేదంటే టమాట ఇస్తున్నారు. వాటితో యూనిట్‌లోని కట్టర్ ద్వారా కట్ చేసి ఫ్లేక్స్ తయారు చేస్తున్నారు. ఇంటి వద్దే ఉంటూ ప్రతి రోజూ రూ.600 నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్నారు.



ఉల్లి ఫ్లేక్స్‌ను చూపిస్తున్న ఈ మహిళ పేరు షేక్ అంజుమ్. గోనెగండ్ల మండలం పెద్ద నెలటూరు గ్రామవాసి. బిస్మిల్లా పొదుపు సంఘంలో సభ్యురాలు. ఇప్పటికే ఈ మహిళ పసుపు, కారం పొడులు ఉత్పత్తి చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో సోలార్ వెజిటబుల్ డీహైడ్రేషన్ యూనిట్ ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు 300 కిలోలు ఉల్లి ఫ్లేక్స్ తయారు చేస్తున్నారు. జనవరి నెలలో రూ.8000 వరకు ఆదాయం పొందారు. ఫిబ్రవరిలో రోజుకు రూ.500 నుంచి 1000 వరకు రూ.17 వేల నికరాదాయం పొందారు.



- జిల్లాలో ఇప్పటికే 322 సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు
- సహకారం అందించిన ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ
- సోలార్ డీహైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటుకు పెరుగుతున్న ఆసక్తి
- రోజుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఆదాయం

కర్నూలు(అగ్రికల్చర్): ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని ఏర్పాటు చేసింది. వ్యక్తిగతంగా లేదంటే సంఘాల ద్వారా పరిశ్రమల ఏర్పాటు చేసుకోవచ్చు. పరిశ్రమల ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో ఏడాది కాలంలోనే మహిళలు 322 ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంట్లోనే జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు. నెలకు రూ.20 వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

టీడీపీ హయాంలో మహిళా సంక్షేమం కేవలం మాటల్లోనే ఉండేది. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని 2104 ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసింది. వివిధ పథకాల ద్వారా ఆర్థిక చేయూతను అందించింది. దీంతో చాలా మంది మహిళలు కిరాణా షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. పశుపోషణ, పొట్టేళ్లు, గొర్రెలు, మేకల పెంపకంలో రాణిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో కొత్తగా ఆహార శుద్ధికి సంబంధించి సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు చేసుకుంటున్నారు.

బ్యాంకుల నుంచి రుణం

18 ఏళ్లు నిండిన వారు ఎవరైనా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. వ్యాపార అభివృద్ధికి అవసరమైన అధునాతన పరికరాల కొనుగోలుకు, వర్క్‌షెడ్‌ల నిర్మాణాలకు అయ్యే వ్యయంలో 10 శాతం మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం బ్యాంకు ద్వారా 90 శాతం రుణ సదుపాయం కల్పిస్తుంది. అలాగే 35 శాతం సబ్సిడీ ఇస్తుంది. వ్యాపారాన్ని సమున్నత స్థాయికి తీసుకెళ్లడానికి అవలంభించాల్సిన పద్ధతులు, పరికరాల వాడకం.. తదితర విషయాలపై నిపుణులతో సూచనలు, అవసరమైన శిక్షణ కూడా ఇప్పిస్తారు. వ్యక్తిగతంగా ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం లేదా గరిష్టంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, పీఏసీఎస్‌లు ముందుకు వస్తే ప్రాజెక్టు ధరలో 35 శాతం లేదా గరిష్టంగా రూ.3 కోట్ల వరకు సబ్సిడీ .. ఇందులో ఏది తక్కువైతే దానిని ఇస్తారు. ప్రాజెక్టు ధర గరిష్టంగా రూ.10 కోట్ల వరకు ఉండాల్సి ఉంది.

విస్తరిస్తున్న యూనిట్లు

వెజిటబుల్ సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. పీఎంఎఫ్‌ఎంఇ కింద సబ్సిడీపై ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ వీటిని ఏర్పాటు చేస్తోంది. ఎస్4ఎస్ అనే సంస్థ సాంకేతికతను అందిస్తోంది. వీటి ద్వారా ఉల్లి, టమాట ఫ్లేక్స్ తయారు చేస్తున్నారు. మొదట్లో కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి పరిమితమైన సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లు ప్రస్తుతం గూడూరు, గోనెగండ్ల మండలాలకు విస్తరించాయి. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇంకా మూడేళ్లు కొనసాగనుండటంతో పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, మద్దికెర మండలాల్లో కూడా యూనిట్లు విస్తరించే అవకాశం ఉంది.

ఇదీ ప్రగతి..

- ఇప్పటి వరకు డీహైడ్రేషన్ యూనిట్‌లకు సంబంధించి 1ఎంఈ మోడల్ మాత్రమే అందుబాటులో ఉంది. దీని ద్వారా రోజుకు 300 కిలోల ఉల్లి లేదంటే టమాటను ఫ్లేక్స్ తయారు చేయవచ్చు. ప్రస్తుతం 5 ఎంఈ, 3 ఎంఈ మోడల్స్ వచ్చాయి. వీటితో రోజుకు 1500 నుంచి 2100 కిలోల ఫ్లేక్స్ తయారు చేయవచ్చు.
- ఫ్లేక్స్ తయారీకి ఎస్4ఎస్ సంస్థ కిలోకు రూ.2.80 చెల్లిస్తుంది. ఫ్లేక్స్‌ను ఎస్4ఎస్ సంస్థనే సేకరించి మహారాష్ట్రకు తరలిస్తుంది. అక్కడి నుంచి ఇవి అరబ్బు దేశాలకు ఎగుమతి అవుతాయి.

మెరుగుపడిన జీవనోపాధి

ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటులో మహిళల జీవనోపాధి మెరుగుపడింది. కొందరు చిరు ధాన్యాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. మరికొందరు పాల ఆధారిత ఉత్పత్తులు, నూనెగింజల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్లో అమ్ముతున్నారు. పప్పు దినుసులు- గోధుమల ఆధారిత ఉత్పత్తులు, పచ్చళ్ల తయారీలో ఇంకొందరు రాణిస్తున్నారు. ఏడాది కాలంలో జిల్లాలో 322 ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటితో మంచి లాభాలు వస్తున్నాయి. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈ దరఖాస్తులను బ్యాంకులకు పంపి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటోంది.

కాలుష్యానికి తావు లేదు

స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులను అభివృద్ధి చేయయడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. వెజిటబుల్ సోలార్ డ్రైయర్ల ద్వారా ఎక్కువగా ఆదాయం పొందవచ్చు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఏఏడీఏ) పరిధిలోని మండలాల్లో వీటిని పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నాం. అయితే కొంతమంది వీటి వల్ల కాలుష్యం వస్తోందని ప్రచారం చేస్తున్నారు. ఇటువంటి వాటిని ఎవరూ నమ్మొద్దు

– ఉమాదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, కర్నూలు

సీసీ కెమెరాల పర్యవేక్షణలో గ్రూప్ -1 పరీక్షలు

- రేపు కర్నూలులో 31 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 11,384 మంది అభ్యర్థులు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన జేసీ



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అర్బన్): గ్రూప్ -1 పరీక్షలను ఈ నెల 17వ తేదీన సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని, వీటి ద్వారా ఏపీపీఎస్సీ కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో గ్రూప్ -1 పరీక్షల నిర్వహణపై శుక్రవారం సంబంధిత అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 17న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్ -2 పరీక్ష నిర్వహిస్తారన్నారు. కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన 31 సెంటర్లలో 11,384 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పరీక్షల కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోను అనుమంతించరాదని సూచించారు. 31 మంది జిల్లా స్థాయి అధికారులను లైజనింగ్ ఆఫీసర్లుగా నియమించామని, వీరు ప్రశ్న పత్రాలను, ఓఎంఆర్ షీట్లను ఉదయం 5 గంటలకు ట్రెజరీ నుంచి తీసుకొని కోడ్ నంబర్ల ప్రకారం ఏ సెంటర్‌కు సంబధించిన వాటిని ఆ సెంటర్లకు పోలీస్ సెక్యూరిటీతో తీసుకొని వెళ్లి అప్పగించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు , దివ్యాంగులు కింద ఫ్లోర్‌లోనే పరీక్ష రాసే విధంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. అంధులకు సహాయకులను ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ఏపీపీఎస్సీ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ బీసీహెచ్ఎన్ కుమార్ రాజు, సెక్షన్ ఆఫీసర్ శివ నారాయణరెడ్డి , డీఆర్‌ఓ కే మధుసూదన్‌రావు, డీఎస్పీ విజయశేఖర్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు హెల్ప్ డెస్క్

జిల్లాలో ఈ నెల 17న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న గ్రూప్-1 సర్వీసెస్ పరీక్షలకు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు రాసే అభ్యర్థుల సౌకర్యార్థం ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటైందన్నారు. అభ్యర్థులు అవసరమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు వెంకటేష్ (8498031434), శ్రీనివాసులు(8142460214)తో పాటు ల్యాండ్ లైన్ 08518-277305 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి

కర్నూలు(సెంట్రల్): గ్రూపు-1 పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను 17వ తేదీ ఆదివారం మూసి వేయాలని కలెక్టర్ డాక్టర్‌జి. సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు షాపులను మూసి ఉంచాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భారీ నగదు లావాదేవీలపై నిఘా

- పోస్టల్ బ్యాలెట్ కార్డుల పంపిణీకి త్వరలో చర్యలు
- బ్యాంకర్లు, పోస్టల్ సిబ్బంది సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెద్ద మొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై నిఘా ఉంచి, ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లు, పోస్టల్ సిబ్బందితో ఆమె సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మరుక్షణం నుంచి మోడల్ కోడ్ అమల్లోకి వస్తుందన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా చూసేందుకు ఉద్యోగులు సహకరించాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలంటే డబ్బులకు ఓటర్లు ప్రలోభం కాకూడదని, అందుకోసమే పెద్ద మొత్తంలో జరిగే లావాదేవీలపై అనుమానం వ్యక్తం చేసి సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు అందించాలన్నారు.

- లక్ష అంతకు మించిన నగదు లావాదేవీలు(డిపాజిట్/విత్ డ్రా) లేని ఖాతాకు ఉన్నట్టుండి పెద్ద మొత్తంలో నగదు డిపాజిట్ చేసినట్లయితే వివరాలను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకురావాలన్నారు.
- బ్యాంకు ఖాతా నుంచి ఆన్‌లైన్(ఆర్టీజీఎస్)విధానంలో ఒకేసారి ఎక్కువ మందికి ఖాతాలకు గతంలో ఎన్నడూ జరగని లావాదేవీలు జరిగితే సంబంధిత వివరాలను నివేదించాలన్నారు.
- అభ్యర్థి బ్యాంకు ఖాతా, అభ్యర్థి భార్య/భర్త, అభ్యర్థికి సంబంధించిన వారి బ్యాంకు ఖాతాల నుంచి లక్ష అంతకు మించి డిపాజిట్/విత్‌డ్రా చేసినట్లు వివరాలను కూడా అందించాలని కోరారు.
- రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల నుంచి లక్ష రూపాయలు అంతకకు మించి విత్ డ్రా చేసిన వారి వివరాలను కూడా గమనిస్తూ జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు.
- ఒకే రోజులో ఒకే ఖాతాలో పెద్ద మొత్తం నగదు జమ అవుతున్నా అనుమానించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సమయం నుంచి అన్ని లావాదేవీల వివరాలను తమకు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎపిక్ కార్డులను త్వరగా పంపిణీ చేయాలి

ఎపిక్ కార్డులకు సంబంధించి డెలివరీని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని పోస్టల్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రానున్న కార్డులను కూడా పోలింగ్ రోజు నాటికి ఓటర్లందరికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలనికోరారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి పంపే ఫారాలను డిస్పోజ్ వివరాలు ఆర్‌ఓల దగ్గర ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పోస్టల బ్యాలెట్‌ను డెలివరీ చేసే సిబ్బంది ట్యాంపరింగ్ చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్స్ దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషన్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలు రామలక్ష్మి, ఎం.శేషిరెడ్డి, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీసీఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంలో దేశానికి ఏపీ ఆదర్శం

- ప్రభుత్వ బడుల్లో ఐబీ సిలబస్‌ను అమలు చేయబోతున్న ఏకైక రాష్ట్రం ఏపీ
- విద్య, వైద్యం, సంక్షేమంపై ఓపెన్ మైండ్స్ ఆధ్వర్యంలో సెమినార్
- పాల్గొన్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్, పలువురు వక్తలు



మాట్లాడుతున్న వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్



హాజరైన విద్యార్థులు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని శ్రీసాయి కృష్ణ డిగ్రీ కాలేజీలో 'విద్య, వైద్యం, సంక్షేమం-నవ సమాజ నిర్మాణానికి శ్రీకారం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఓపెన్‌మైండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌కు ఆ సంస్థ అధ్యక్షుడు, ఏపీ హైయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కమిషన్ మాజీ మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎస్ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. శ్రీసాయికృష్ణ కాలేజీ కరస్పాండెంట్, సెక్రటరీ పి.గోవర్ధన్ రెడ్డి, రిటైర్డ్ డీఈఓ పాండురంగయ్య ప్రసంగించారు.

➤ రాయలసీమ యూనివర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదువుకుంటే మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు.

➤ రిటైర్డ్ డీఈఓ పాండురంగయ్య మాట్లాడుతూ.. దేశంలో 90 స్కూళ్ళు మాత్రమే ఐబీ సిలబస్‌తో నడుస్తున్నాయన్నారు. వచ్చే ఏడాది నుంచి ఏపీలో ఐబీ సిలబస్‌తో అన్ని ప్రభుత్వ స్కూళ్లలో చదువులు చెప్పాలని నిర్ణయం తీసుకోవడం అద్భుతమన్నారు. ఐబీ సిలబస్‌తో చదివిన పిల్లలు ప్రపంచంలోని 150 దేశాల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయని, అత్యాధునిక బోధనకు ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఏర్పాటు చేశారన్నారు.

➤ ఓపెన్ మైండ్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్యం, సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఏపీలో అద్భుతమైన సమాజం తయారవుతుందన్నారు. సంక్షేమ పథకాలకు ఎంత ఖర్చు చేస్తే అంత గొప్ప నాణ్యమైన సమాజం తయారు అవుతుందన్నారు. చదువుపై పెట్టే ఖర్చు ఎప్పుడూ వృథా కాదన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా విద్య, వైద్యాన్ని ఇంతగా పట్టించుకోలేదన్నారు. భవిష్యత్తులో ఐటీ ఆధారిత పరిశ్రమలు తగ్గి, తయారీ ఆధారిత పరిశ్రమలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ సొసైటీల రిటైర్డ్ రిజిస్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. ఆ తరువాత పలువురు విద్యార్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

'బీసీడీఈ'తో విప్లవాత్మక మార్పు

కర్నూలు కల్చరల్: ఉన్నత విద్యలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (బీసీడీఈ) కార్యక్రమం విద్యారంగంలో విప్లవాత్మక మార్పును తీసుకొస్తుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆర్‌యూలో బీసీడీఈపై ఆర్‌యూ అనుబంధ డిగ్రీ, బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, విద్యార్థులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గతంలో తాను బీసీడీఈ కార్యక్రమానికి తొలి కార్యదర్శిగా వ్యవహరించానన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులలో సామాజిక బాధ్యతను ఈ కార్యక్రమం మేల్కొలుపుతుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, యునిసెఫ్ కన్సల్టెంట్ స్వాతిదేవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలోఈ కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇందులో పాల్గొన్నవారికి యూనిసెఫ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామన్నారు. వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్స్ మేనేజర్ అప్పారావు, ఆర్‌యూ బీసీడీఈ కోఆర్డినేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



పవిత్ర మాసంలో ప్రత్యేక ప్రార్థన

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతున్నారు. ప్రత్యేక ప్రార్థనలు ఆరాధనల్లో నిమగ్నమవుతున్నారు. రోజూ సూర్యాస్తమయం వరకూ కఠోర ఉపవాస దీక్షలు పాటిసున్తన్నారు. ఐదు పూటలా నమాజ్‌తోపాటు తరావీ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. 30 అధ్యాయాలు ఉన్న ఖురాన్‌ను నెలలోగా పఠించాలన్న ప్రవక్త ఆదేశాన్ని తప్పక పాటిస్తున్నారు. మొదటి శుక్రవారం పవిత్రమైన రోజు కావడంతో కర్నూలు నగరంలోని గణేశ్ నగర్ మున్వరా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

31 వరకు లేపాక్షి క్లియరెన్స్ సేల్స్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియంలో ఈ నెల 31 వరకు క్లియరెన్స్ సేల్స్ జరుగుతాయని మేనేజర్ తిమ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన వస్తువులపై 40 శాతం వరకు రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు థిమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఉడ్ కార్వింగ్, దుర్గి స్టోన్ ఐటమ్స్, ఆళ్లగడ్డ రాతి చిత్రాలు, మదనపల్లి-టెర్రికోట మట్టి బొమ్మలతో ఐదు రోజుల పాటు ఎగ్జిబిషన్/ సేల్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అపురూపమైన చేతి వృత్తులకు మరింత ఆదరణ కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉగాది పర్వదినం నేపథ్యంలో ఈ ఎగ్జిబిషన్‌కు ఆంధ్ర ప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చిందన్నారు.

విద్యుత్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ఆదోనిఅర్బన్: వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ ఎస్ఈ ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక డీఈ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ కావాలన్న వారికి వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆదోని ఇన్‌చార్జి డీఈ రాజేష్, ఏడీఈ పురుషోత్తం, ఏఈ నాగ భూషణం, డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 30వతేదీ వరకు జరగనున్న పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థి, విద్యార్థినులు ఒరిజినల్ హాల్ టికెట్ కండెక్టర్‌కు చూపిస్తే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ అవకాశం అన్ని పల్లెవెలుగు (ఆర్డినరీ) బస్సుల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు ఉండే స్థానం నుంచి పరీక్ష కేంద్రం వరకు కేవలం పరీక్ష ఉన్న రోజు, సమయంలోనే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: చిన్నభూంపల్లిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కోసిగి, ఎమ్మిగనూరు సెబ్ సీఐలు మహబూబ్ బాషా, పి. శివకృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. చిన్న భూంపల్లి గ్రామంలో కోసిగి, ఎమ్మిగనూరు సెబ్ పోలీసులతో కలిసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామన్నారు. దాడులు నిర్వహిస్తుండగా గ్రామ శివారులో బైక్‌పై ఏడు బాక్స్‌లలో 672 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామని, బైక్‌ను వదిలేసి గ్రామానికి చెందిన లక్ష్మయ్య పరారయ్యాడన్నారు. త్వరలో అతన్ని అరెస్ట్ చేస్తామని తెలిపారు.

మా మంచి సీఎం

- బనగానపల్లె పర్యటనలో సీఎం జగన్‌ను కలసిన అభాగ్యులు
- ఆపదలో ఉన్నామని ఆదుకోవాలని విన్నపం
- పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 16.30 లక్షల ఆర్థికసాయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధులు విడుదల చేయడానికి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలు కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. ఆపదలో ఉన్నామని.. ఆదుకోవాలని విజ్ఞప్తి చేసిన వెంటనే మానవతా దృక్పథంతో వారికి ఆర్థిక సాయం అందజేయాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులును సీఎం ఆదేశించారు. దీంతో వెంటనే కలెక్టర్ బాధితుల వివరాలు తెలుసుకుని 16 మందికి రూ.16.30 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందజేశారు.

– సాక్షి, నంద్యాల



బనగానపల్లెలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తన సమస్యను విన్నవిస్తున్న అవుకు మండలం సంగపట్నానికి చెందిన షేక్ షరీఫ్



సీఎం ఆదేశాల మేరకు షేక్ షరీఫ్‌కు ఫిజియో థెరపీ చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల చెక్కు అందజేస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

సీఎం రిలీఫ్ ఫండ్ పొందిన వారి వివరాలు

- నంద్యాల పట్టణం గాంధీనగర్‌కు చెందిన లక్కా కేశవ పక్షవాతంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష అందజేశారు.
- నంద్యాల పట్టణం గాంధీనగర్‌కు చెందిన కె.మార్తమ్మ మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- అవుకు మండలం సంగపట్నానికి చెందిన షేక్ షరీఫ్ ఫిజియో థెరపీ చికిత్స కోసం రూ. 2 లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు.
- అవుకు మండలం గుండ్ల సింగవరానికి చెందిన ఎస్.గణేష్ బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష అందజేశారు.
- అవుకు మండలం సింగనపల్లెకు చెందిన ఎ.తారకేశవ్ మానసిక వికలత్వంతో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- అవుకు మండలం గుండ్ల సింగవరానికి చెందిన కాటసాని గణేష్ బ్రెయిన్‌లో నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుని చికిత్స కోసం రూ. 50 వేల చెక్కును కలెక్టర్ అందజేశారు.
- బనగానపల్లె మండలం గుండ్ల సింగవరం గ్రామానికి చెందిన కంబగిరి స్వామి మెదడులో నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. అతని చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం ఒద్దిరాళ్ల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. అతనికి చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- అనంతపురం పాతబస్తీకి చెందిన పి.ముష్కస్ బ్యాక్ బోన్ ఫ్యాక్చర్‌తో బాధపడుతోంది. ఆమెకు చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- రోడ్డు ప్రమాదంలో మోకాలు పోగొట్టుకున్న అనంతపురానికి చెందిన బాధితుడు ఎస్.ఖాజాకు రూ.50 వేల చెక్కును అందజేశారు.
- ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామానికి చెందిన సి.సోమశేఖర్ పేదరికం కారణంగా గృహ నిర్మాణం నిమిత్తం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- ప్రకాశం జిల్లా ఓబులంపల్లికి చెందిన బాల గురువయ్య వైద్య ఖర్చుల కోసం అతని భార్యకు రూ.లక్ష చెక్ అందజేశారు.

కిడ్నీ బాధితుడికి..

బనగానపల్లె మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ వజీద్ తన కుమారుడు కిడ్నీ సమస్యతో 18 నెలలుగా బాధపడుతున్నాడని నెలకు రూ.5 వేలు వైద్యానికే ఖర్చవుతోందని సీఎం జగన్‌తో చెప్పారు. స్పందించిన సీఎం చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందివ్వాలని కలెక్టర్‌కు సూచించడంతో వెంటనే రూ.లక్ష చెక్‌ను అందజేశారు.

చిన్నారికి సాయంగా..

అవుకు మండలం వేములపాడు గ్రామానికి చెందిన బి.మనురాహుల్(6) వికలత్వంతో బాధపడుతున్నానని, వ్యాధి చికిత్సకు ఆర్థిక సాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌ను తల్లిదండ్రులు కలిసి అభ్యర్థించారు. సీఎం ఆదేశంతో రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు.

దివ్యాంగుడికి ఆసరాగా..

బనగానపల్లె పట్టణానికి చెందిన దివ్యాంగుడు అబ్దుల్ హాజీమ్(22) తాను వికలత్వంతో బాధపడుతున్నానని ఆర్థికసాయం చేయాలని సీఎం జగన్‌కు అభ్యర్థించారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ శ్రీనివాసులు హాజీమ్‌కు రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

నిరుపేదకు అండగా..

గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన హరిజన గోరంట్ల దివ్యాంగుడు. పేదరికంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. తన పరిస్థితిని బనగానపల్లె సభలో సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పై చదువులకు రూ.15 వేలు, జీవనోపాధి కోసం మరో రూ.15 వేలను కలెక్టర్, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మొత్తం రూ.30 వేల చెక్కును అందజేశారు.

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేకాలంకరణలో విష్వక్సేనుడు



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి వైభవంగా అంకుర్పారణ చేశారు. అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎగువ అహోబిలంలోని శ్రీ జ్వాలా నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడికి పూలమాలలు వేసి, తల పాగా చుట్టి పల్లకీలో కొలువుంచి ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలకు పర్యవేక్షకుడిగా విష్వక్సేనుడు వ్యవహరిస్తారని విశ్వాసం. అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపు ఉన్న పుట్టకు పూజలు నిర్వహించి పుట్ట మన్నును సేకరించి మండపం దగ్గరకు తీసుకువచ్చారు. అక్కడ అంకుర హోమం నిర్వహించి సోముడిని (చంద్రుడిని) మట్టిలోకి ఆవాహం చేశారు. పాత్రలో మట్టిలో నవగ్రహాలకు సూచికగా నవధాన్యాలను పోసి సోమకుంభ స్థాపన చేశారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం భేరీపూజ కొనసాగుతుంది. మధ్యాహ్నం అభిషేకం, రాత్రి స్వామి వారు సింహ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమివ్వనున్నారు. దిగువ అహోబిలంలో అంకురార్పణ కార్యక్రమం ఉంటుంది

నేడు దిగువ అహోబిలంలో..

దిగువ అహోబలంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో అంకుర్పారణ పూజలు నిర్వహిస్తారు.

ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

కర్నూలు (టౌన్): కర్నూలు, నంద్యాల జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్ రెడ్డి ఇచ్చిన నివేదికల ఆధారంగా విధులను నిర్లక్ష్యం చేసిన ముగ్గు రు పోలీసులను సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. తన భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఒక మహిళ అవుకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించకపోవడంతో అమె హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి అవు కు పోలీసు స్టేషన్ ఏఎస్ఐ వి.ఎల్. సుబ్రమణ్యం,కానిస్టేబుల్ నందు నాయక్‌లను సస్పెండ్ చేశా రు. అలాగే కర్నూలు త్రీటౌన్ పోలీసు ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ , అతని కుటుంబ సభ్యులు ఏడు నెలల గర్భవతి అయిన తమ కోడలిని అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా వేధించడంతో అమె ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో తిరుపాల్ నాయక్‌ను సస్పెండ్ చేశారు.

ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభా గం ప్రధాన కార్యదర్శిగా కె.అనిల్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

రైతుల కోసం ఎమ్మెల్యే భూమి విరాళం

- 10 ఎకరాల భూమి విరాళంగా ఇచ్చిన మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- ఆ స్థలంలో రూ.71.93 కోట్లతో ఏర్పాటు కానున్న విద్యుత్ సబ్ స్టేషన్
- వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు



వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే

కోసిగి: రైతుల కోసం మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి 10 ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారు. నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం మండలాలోని రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించారు. ఇందుకోసం రూ.71.93కోట్లు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నియోజకవర్గంలో మాధవరం 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. అయితే కోసిగి, కౌతాళం మండలాలలకు లోఓల్టేజ్ సమస్య ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని కోసిగి మండలంలో 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించేలా ఏపీట్రాన్స్‌కో ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు 10 ఎకరాలు భూమి కేటాయించాలని సూచించారు. మండలంలోని ఎక్కడా ప్రభుత్వ భూమి లేకపోవడంతో మూగలదొడ్డి, బత్తల బొమ్మాలపురం గ్రామ పొలాల మధ్యలో ఎమ్మెల్యే సొంతంగా 10 ఎకరాలు భూమి కేటాయించి నివేదిక పంపారు. స్థలం కేటాయించడంతో ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుని 132/33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపి ఇందుకు కావాల్సిన బడ్జెట్ కేటాయిస్తు పనులు ప్రారంభించుకోవచ్చునని ఆదేశాలు ఇచ్చింది. అయితే ఎమ్మెల్యే మాతృమూర్తి లలితమ్మ అకాల మరణంతో అందుబాటులో లేకపోయారు. శుక్రవారం పనులు ప్రారంభం చేయాల్సి ఉంది. కోసిగి, కౌతాళం మండలాల రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయడంతో ఆయా మండలాల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణం..కమనీయం



గోదా రంగనాథ స్వామి వార్లకు కల్యాణం నిర్వహిస్తున్న జీయర్ స్వామీజీలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ గోదా దేవి సమేత రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నలుగురు జీయర్ స్వాములు ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉభయ దేవేరులను సువర్ణ భూషితులుగా అలంకరించి శ్రీ రంగనాథునితో జరుగుతున్న కల్యాణ విశిష్టత గురించి అష్టాక్షరీ సంపత్కుమార రామనుజ జీయర్ స్వామి హృద్యంగా వివరించారు. స్వామివారికి హనుమద్వాహన సేవ నిర్వహించారు. గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో స్వామివారు విహరించారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం కల్యాణ క్రతవును నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనా విభావరి భక్తులను తన్మయులను చేసింది. పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి, ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామి, పరమాత్మ నందగిరి స్వామి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్ధన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యంతో పాటు గోదాగోకులం పరివారం పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బైరెడ్డి శబరి

సాక్షి, నంద్యాల: భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు బైరెడ్డి శబరి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో శుక్రవారం ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నంద్యాల ఎంపీ టికెట్ శబరికి ఖరారు అయినట్లు సమాచారం. ఇన్ని రోజులు తనకే టికెట్ ఇస్తున్నట్లు టీడీపీ నంద్యాల పార్లమెంటరీ అధ్యక్షుడు మాండ్ర శివానంద రెడ్డి చెప్పుకుంటు వచ్చారు. శబరి రాకతో మాండ్రను తప్పించినట్లు తెలు స్తోంది. ఐదేళ్లు పార్టీ కోసం భారీగా డబ్బులు ఖర్చు పెట్టించి టికెట్ ఇవ్వక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే శబరి వెంటే ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఉన్నా టీడీపీ కండువా కప్పుకోకపోవడం గమనార్హం.

భానుడు భగభగ

- 42 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరువయ్యాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 41.90 డిగ్రీలు, నంద్యాల జిల్లాలో అత్యధికంగా 41.93 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలు దాటినా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
మంత్రాలయం	41.90
గూడూరు	41.29
కోసిగి	41.20
కోడుమూరు	40.95
ఆదోని	40.90
అవుకు	41.93
నందికొట్కూరు	41.56
మహానంది	41.2
బండి ఆత్మకూరు	41.09
ప్యాపిలి	40.7



పరీక్షలు అయిపోయాయోచ్..



టాటా..బాయ్‌బాయ్..వీడ్కోలు చెబుతూ..

హాయిరే హాయ్.. జాయ్‌రే జాయ్!

ఇంత వరకు వారు పుస్తకాలతో కుస్తీ పట్టారు. టీవీలకు, సెలఫోన్లకు దూరంగా ఉంటూ రేయింబవళ్లు కష్టపడి చదివారు. ఇంటర్ పరీక్షలను శ్రద్ధగా రాశారు. శుక్రవారం పూర్తి కావడంతో ఆనందంగా చిందులు వేశారు. తోటి మిత్రులతో సంతోషాన్ని పంచుకున్నారు. కాలేజీలకు, హాస్టళ్లకు వీడ్కోలు చెబుతూ సొంత ఊర్లలో హాయిగా గడిపేందుకు పయనమయ్యారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



టెన్షన్ తగ్గింది.. ఐస్‌క్రీమ్ తిందాం



హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరుతూ..



విద్యార్థులతో కిక్కిరిసిన కర్నూలు ఆర్టీసీ బస్టాండ్



బస్సులో సీట్ల కోసం పాట్లు..